క్లుప్తంగా

ట్రస్మా కార్యవర్గం ఏర్పాటు



వేల్పూర్: మండల కేంద్రంలోని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో మంగళవారం ట్రస్మా ఆర్మూర్ డివిజన్ కార్యవర్గం సమావేశంను నిర్వహించి నూతన కమిటీని ఎంపిక చేశారు. నిజామాబాద్ జిల్లా కన్వీనర్ రాజు గుజరాతి ఆధ్వర్యంలో ట్రస్మా డివిజన్ అధ్యక్షుడిగా జక్రాన్‌పల్లి సరస్వతి శిశుమందిర్ కరస్పాండెంట్ బొద్దుల చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా పడగల్ భాను పాఠశాల కరస్పాండెంట్ మంద ప్రభాకర్, కోశాధికారిగా భీమ్‌గల్‌కు చెందిన పీరి గంగాధర్‌ను ఎంపిక చేశారు. ట్రస్మా ఉపాధ్యక్షుడు పుచ్చుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఎన్నికలు ప్రశాంతం



నవీపేట: మండల కేంద్రంలోని టీఎస్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో మంగళవారం నిర్వహించిన హెడ్‌బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. హెడ్‌బాయ్‌కు నలుగురు అభ్యర్థులు, హెడ్‌గర్ల్‌కు ఆరుగురు అభ్యర్థులు పోటీపడ్డారని పేర్కొన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు, విజేతల వివరాలను ఎన్నికల అధికారి అయేషా బుధవారం వెల్లడిస్తారని పేర్కొన్నారు.ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ఈ ఎన్నికలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమే



బోధన్: సెప్టెంబర్ 17 విలీనం, విమోచన కాదని మూమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన డివిజన్ సహాయ కార్యదర్శి బీ. మల్లేష్ అన్నారు.మంగళవారం పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అణిచివేత, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజలు సంఘటితమై వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. పోరాడి సాధించినకున్న భూస్వాముల భూములను మళ్లీ తిరిగి వారికే అప్పగించారని వివరించారు. నాయకులు బీపాషా, పోశెట్టి, నాగేశ్వర్, గౌతం, సలీం, ఖాజా,యాదమ్మ, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు అందించారు. ఎనిమిది మందికి కలిపి రూ.3లక్షల చెక్కులను అందించినట్లు నాయకులు పేర్కొన్నారు. నాయకులు బొదిరె స్వామి, నాగేంద్రబాబు, అనంతరావు, మల్లెల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు ప్రతిరోజు వ్యక్తి పరిశుభ్రత పాటించాలని డాక్టర్ హసన్‌హుల్లాఖాన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

కంటి శిబిరం

బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యుడు పుణ్యా రాజు 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు.

పోషణ్ భీ, పడాయి భీతో చిన్నారులకు ప్రయోజనం

కమ్మర్‌పల్లి: పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమంతో చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పోషణ్‌బీ, పడాయి బీ కార్యక్రమంపై మూడు మండలాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడారు.

ప్రమాదంలో గాండ్లపేట్ వంతెన

- పెద్దవాగు ఉధృతికి కోతకు గురవుతున్న మట్టికట్ట
- స్పందించాలని అధికారులకు వినతి



గాండ్లపేట్ వంతెన వద్ద కొట్టుకుపోతున్న మట్టికట్ట

మోర్తాడ్(బాల్కొండ): జాతీయ రహదారి 63పై ఉన్న గాండ్లపేట్ వంతెన వద్ద మట్టికట్ట కోతకు గురవుతోంది. మట్టికట్ట పూర్తిగా తొలగిపోతే వంతెనకు ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై కీలకమైన వంతెనను మోర్తాడ్ మండలంలోని గాండ్లపేట్ వద్ద పెద్దవాగుపై నిర్మించారు. వరద కాలువకు వెళ్లే మార్గంలో ఉన్న మట్టికట్ట రెండు, మూడు రోజుల నుంచి కోతకు గురవుతోంది. 39 ఏళ్ల తరువాత పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్దవాగు ఆరు మీటర్లకు ఎక్కువ ఎత్తులో ప్రవహించడంతో నీటి ధాటికి మట్టికట్ట కొట్టుకుపోతుంది. వరద కాలువ నీరు పెద్దవాగుపై నుంచి వెళ్లడానికి అక్విడెక్ట్ నిర్మించారు. అక్విడెక్ట్‌కు వంతెనకు మధ్య ఉన్న మట్టికట్టనే కోతకు గురైతుంది. వంతెనకు ప్రమాదం ఏర్పడితే నిజామాబాద్ నుంచి కరీంనగర్, వరంగల్ మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగనుంది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వరద ఉధృతి తగ్గిన తరువాత మరమ్మతులు

వరద ఉధృతి తగ్గిన తరువాత కోతకు గురైన మట్టికట్ట వద్ద మరమ్మతులు చేపడుతాం. ఉన్నతాధికారులకు ఈ సమాచారం అందించాం. వరద కాలువకు సంబంధించిన పనులు జరిగిన సమయంలో మట్టిపోశారు.

– వినీత్, జేఈ, ఎన్‌హెచ్ 63

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ లో చెత్త



ఆందోళన చేస్తున్న వినియోగదారులు, ఇన్ సెట్లో ప్యాకెట్‌లో వచ్చిన చెత్త

వర్ని: ఓఆర్ ఎస్ ప్యాకెట్‌లో చెత్త రావడంతో వినియోగదారులు మంగళవారం రాత్రి మెడికల్ షాపు నందు ఆందోళన నిర్వహించారు. వర్ని మండల కేంద్రంలోని మెడ్ ప్లస్ మెడికల్ లో అక్బర్ నగర్ గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ అనే వ్యక్తి రెడ్డిస్ కంపెనీకి చెందిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల ను సోమవారం కొనుగోలు చేశాడు. మంగళవారం సాయంత్రం వాటిని సేవించగా చెత్త రావడంతో ప్యాకెట్లను మెడికల్ వద్దకు తీసుకువచ్చి నిర్వాహకులను ప్రశ్నించారు. అనారోగ్యంతో ఉన్నవారికి చెత్త తో కూడిన ఓఆర్ ఎస్ ప్యాకెట్లు తాగించడంతో మరింత అనారోగ్యానికి గురి అయ్యారని బాధితులు నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. మెడ్‌ప్లస్ యాజమాన్యం ఈ విషయంలో స్పందించకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేసి మెడికల్ ముందు ఆందోళన చేపట్టారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి గ్రామంలోని కేజీబీవీలో టీయుసీఐ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించే చలో ఎస్‌పీడీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్, హెల్పర్స్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవో వెబ్‌సైట్‌లో ఇన్‌స్ట్రక్టర్, ఆయాల తాత్కాలిక జాబితా

నిజామాబాద్‌నాగారం : జిల్లాలోని ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్, ఆయాల తాత్కాలిక జాబితా డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో అశోక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం రూమ్ నంబర్ 117లో సూపరింటెండెంట్‌కు రాతపూర్వకంగా అప్పీలు చేసుకోవాలన్నారు.

కరాటే పోటీల్లో బోధన్ విద్యార్థుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

బోధన్‌టౌన్(బోధన్): కరాటే పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని పట్టణంలోని ఓకినోవా కరాటే స్కూల్ మాస్టర్ సాయిలు మంగళవారం తెలిపారు. ఈనెల 14న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో విక్టోరియా షాటోకన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ దూ ఇండియా 2025 ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో స్పారింగ్, కతాస్ విభాగాల్లో విద్యార్థులు సత్తా చాటారు. సాన్వి, సాయి తనుష్, మురళి బంగారు పతకాలు గెలుచుకోగా, మయాంక్, శ్రీకరణ్, హర్షనంద్, జస్విత, సమృద్ధి, వెండి పతకాలను, సాయికుమార్, భార్గవ్, శ్రీదీప్తి, రిషిత, సిద్ధు, హితేశ్, వరుణ్ కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈపోటీలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై గెలిచిన క్రీడాకారులకు పతకాలను అందజేసి అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ గ్రీన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని లయన్స్ గ్రీన్ రీజినల్ చైర్మన్ ఎం. రాజన్న అన్నారు. మంగళవారం ఆర్మూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా 25మంది ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను శాలువ, జ్ఞాపిక తో సత్కారించారు. అనంతరం లయన్స్ గ్రీన్ ప్రోగ్రాం చైర్మన్ గుజరాతి ప్రకాష్, లయన్స్ సభ్యులు శ్రీనివాస్, గోపికృష్ణ, డీకే రాజేష్, చేపూర్ గణేష్, పోల్కం వేణు, రామకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ , దేవాంగ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్ పహడే అన్నారు. రుద్రూర్‌లో సోమవారం రాత్రి దేవాంగ సంఘం ఆధ్వర్యంలో బోధన్ డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 20 మంది దేవాంగకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి లోగం సురేష్, ఉపాధ్యక్షులు ఈర్వ శ్రీనివాస్, వాణి సాహితి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎల్. నాగరాజు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు ...

బాల్కొండ/బోధన్ : మండలంలో కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో ఇంజినీర్స్ దినోత్సవం సందర్భంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన వరద కాలువ డిప్యూటీ ఈఈ గణేశ్‌ను బాల్కొండ లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, జోనల్ కార్యదర్శి జ్ఞాన సాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, ఎస్సారెస్పీ ఇంజినీర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే బోధన్ పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డీఈ ముక్తార్,ఏఈ నాయిని క్రిష్ణ, మున్సిపల్ డీఈ మహేష్, గాంధీయంగ్ టెక్నాలజికల్ ఇన్నోవేషన్ అవార్డు గ్రహీత సాయి అమిత్, శ్రీ అసోసియేట్స్ ఇంజినీర్ కర్నె శ్రీనివాస్‌లను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. క్లబ్ ప్రతినిధులు కృష్ణమోహన్,సాంబిరెడ్డి, సత్యనారాయణ, శ్రీకాంత్, రమణారెడ్డి,రామకృష్ణ, శ్రీనివాసరాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

మాక్లూర్: బాధితులరాలికి ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం చేశారు. అమ్రాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 10న వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ పేలి మధ్యాహ్న భోజన కార్మికురాలు రాంపూర్ లలిత గాయపడ్డ విషయం తెలిసిందే. లలితకు వైద్య ఖర్చుల నిమిత్తం అందించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సేకరించినవి రూ. 50,000 కాగా, అమ్రాద్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం రూ 25,000 విరాళాలు జమ చేశారు. ఎంఈవో సత్యనారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగోనే కిషన్, మండల అధ్యక్షుడు గడ్డం నగేష్‌రెడ్డి, అమ్రాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఈమొత్తం రూ.75,000లను లలిత కుటుంబ సభ్యులకు మంగళవాంరం అందజేశారు. లలిత కోలుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

యూరియా కోసం బారులు



వర్షంలో పడిగాపులు కాస్తున్న రైతులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు మంగళవారం బారులు తీరారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండటంతో యూరియా ఎక్కువ అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. యూరియా ఒక్క లోడ్ రావడంతో రైతులు ఆందోళనతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్దకు టోకెన్ల కోసం క్యూలో పట్టపాస్‌బుక్ లు, చెప్పులు ఉంచారు పెట్టారు. వర్షం సైతం లెక్క చేయకుండా రైతులు యూరియా కోసం వేచిఉన్నారు. ప్రతి రైతుకు రెండు బస్తాలు యూరియా అందించారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



ఆలూర్‌లో మార్చ్‌పాస్ట్ విజేతలకు బహుమతులను అందిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై



క్రీడా దుస్తులను అందిస్తున్న ముక్కెర విజయ్

పెర్కిట్(ఆర్మూర్): ఆటల్లో విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆలూర్ తహసీల్దార్ రమేష్ అన్నారు. ఆలూర్‌లో మంగళవారం మండలస్థాయి అంతర పాఠశాలల క్రీడలను తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలన్నారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు, పీడీలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ సోమవారం రాత్రి క్రీడా దుస్తులను అందజేశారు. అంతర పాఠశాలల క్రీడా పోటీల నేపథ్యంలో తన సొంత ఖర్చులతో విద్యార్థులకు రూ.18 వేల విలువ గల 40 క్రీడా దుస్తులను అందజేశారు.ఎంఈవో నరేందర్, పీడీ రాజేష్, మాజీ సర్పంచ్ క్లెం మోహన్ రెడ్డి, కుర్మె ముత్యం, పీడీ జీ రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



బోధన్‌లో మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య

బోధన్/బాల్కొండ : ప్రతి పాఠశాలలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల వివరాలను 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేయాలని బోధన్ ఎంఈవో నాగయ్య హెచ్‌ఎంలకు సూచించారు.మంగళవారం పట్టణ కేంద్రంలోని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండల స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ స్వచ్ఛ విద్యాలయ పురస్కారం కోసం పాఠశాల వివరాలను, చేపడుతున్న కార్యక్రమాలను ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. బాల్కొండ ఎమార్సీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ప్రశస్త' యాప్ పై హెచ్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ 21 రకాల అంగవైకల్యాలకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ యాప్ ద్వారా గుర్తించాలని సూచించారు. సంబంధిత యాప్‌లో నమోదు ప్రక్రియ తీరును స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ విశ్వనాథ్, రాజ్యలక్ష్మి వివరించారు. కిషన్ నగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణవేణి, ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు ప్రభాకర్, విజయ్, రేఖ, విజయ, శివానంద్, యూసుఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



బాల్కొండ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్(సీజీఆర్‌ఎఫ్) ఎరుకల నారాయణ అన్నారు. మెండోరా సబ్‌స్టేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఫీల్డ్‌కి వెళ్లి విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ట్రాన్స్ కో డీఈ రాజేశ్వర్, శ్రీనివాస్, ఏడీఈలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో భారీ వర్షం



హౌసింగ్ బోర్డ్ వెళ్లే దారిలో మురికి కాలువపై పారుతున్న వరద నీరు

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ పట్టణంలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు అన్ని జలమయమయ్యాయి దీంతోపాటు మురికి కాలువలు పొంగి పొర్లాయి. పట్టణంలోని గీత భవన్ ఎదుట భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. హౌసింగ్ బోర్డ్ వెళ్లే రహదారి వద్ద భారీగా వరద నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎంజీ ఆస్పత్రి సమీపంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు.



గీత భవన్ ఎదుట నిలిచిన వర్షపు నీరు

విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ



బాలుర పాఠశాలలో చేతిరాతపై శిక్షణ ఇస్తున్న మల్లికార్జునరావు

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేకమైన చేతిరాతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జాతీయ హ్యాండ్ రైటింగ్ అకడమీ డైరెక్టర్ డా. వై. మల్లికార్జున రావు (అక్షర శిల్పి అవార్డు గ్రహీత) హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులకు సరైన హ్యాండ్ రైటింగ్ నైపుణ్యం మాత్రమే కాదని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విద్యా విజయానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు పెన్నులు, కాపీల వితరణ

నవీపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జనవికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిళ్లు, కాపీలు, ప్యాడ్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు రాజేష్, బీసీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సంతోష్, నాయకులు ఉన్నారు.

కోతి దేవుని జాతర

నవీపేట: మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం కోతి దేవుని జాతర సం బిజీరాలను ఘనంగా నిర్వహించారు. 49 ఏళ్ల కిందట గ్రామంలోని భక్తులు దైవంగా భావించి పూజలు చేసే కోతి అనారోగ్యంతో మృతి చెందగా ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతియేటా వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన గోపరి వినోద్ ఇటీవల సెల్‌ఫోన్ పోయిందని కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను గుర్తించారు. ఎస్‌ఐ సునీల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం బాధితునికి సెల్‌ఫోన్ అందజేశారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందిచే ఉచిత ఫిజియోథెరపీ శిక్షణ సేవలనున వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. ఆర్మూర్‌లోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ



శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు.ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్సను అందించారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవంకు తరలిరావాలి



మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని మోతె రోడ్డులో ఉన్న విశ్వకర్మ గుట్టపై బుధవారం నిర్వహించనున్న శ్రీభగవాన్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు. పట్టణం నుంచి గుట్ట వరకూ విశ్వకర్మ భగవాన్ చిత్ర పటాన్ని ఊరేగింపుగా తీసుకవెళతామని వెల్లడించారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర

నవీపేట: మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గరుత్మంతుని శావా(శోభాయాత్ర) ఆకట్టుకుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి అనంతరం వేంకటేశ్వర ఆలయం నుంచి హనుమాన్ మందిరం వరకు ఈ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ ప్రతినిధులు, అయ్యవారి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఒక్కరోజే 33 అడ్మిషన్లు

బాల్కొండ: బాల్కొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఒక్కరోజు 33మంది మహిళలు ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకున్నారని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ గోపి తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడారు.

రైతులకు యూరియా అందించాలి



బోధన్: పంటల సాగుకు రైతుల అవసరాల మేరకు యూరియాను అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుమ్ముల గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎడపల్లి మండల తహసీల్దార్ ఆఫీస్ ఎదు ట ఏఐపీకేఎస్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకు లు ధర్నా నిర్వహించినంతరం తహసీల్దార్ దత్తాద్రికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల కు ఎకరానికి రూ.70 వేల పరిహారం చెల్లించి ఆ దుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చే యూత పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించడం సిగ్గుచేటన్నారు.నాయకులు శ్రీపతి మల్లేష్, రవి, సుదర్శన్, హన్మాండ్లు, ఎస్‌కే నసీర్, సిద్ద పోశెట్టి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించాలి



రుద్రూర్ : మండలంలోని చిక్కడపల్లి శివారులోని ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకొని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు రాజు, సభ్యులు రాజయ్య, మక్కయ్య, పరమేష్, మల్లయ్య తదితరులున్నారు.